# ఎదురుతిరిగిన కథ

## సాయిప్రభ



"ఏవండోయ్!" గావుకేక పెట్టింది సుబ్బలక్ష్మి.

"ఏవిటే సుబ్బులూ! ఏవిటీ హడావుడి?" - మళ్ళీ నెల తప్పిందేవిట్రా భగవంతుడా? ఆపరేషన్ చెయించుకోకపోవడం నా తప్పే. ఈసారికి క్షమించి వదిలేయ్ తండ్రీ! ఓ నూరు ఎ క్లాసు పంచదార కార్డుల్ని నీ హుండీలో ఎలాగైనా పడేస్తాను! అని మొక్కుకున్నాడు తాసీల్దారాఫీసులో గుమాస్తాగిరీ వెలగబెడుతున్న రంగనాథం.

"చూసారా! మన మీనాక్షమ్మొదిన వ్రాసిన కథ పత్రికలో అచ్చుపడింది."

"ఓస్! ఇంతేనా! ఎంత కంగారు పెట్టేసావే నీ అసాధ్యం గూలా! స్మగ్లర్ల మీద దాడి జరిపే అధికారిలాగ?"

"అంతేకాదండీ ఆ కథని

సినిమా కూడా తీస్తున్నార్ట!"

"చెట్టు చెడే కాలానికి కుక్క మూతి పిందె అని ఊరికే అన్నారా మరి?"

"పై పెచ్చు ఆ కథకి పదివే లిచ్చారట!పదివేలు!" ఆ సొమ్మేదో తనకే ఇచ్చినట్టు, ఇచ్చిన సొమ్మేం చేయాలో తోచక తికమక పడుతున్నట్టు చూపింది.

"ఆ సొమ్మే మనకుంటేనా?" కలర్‌స్కోప్‌లో కలలు కంటోంది సుబ్బలక్ష్మి.

"ఉంటే?! పది తులాలకు మించకుండా వజ్రాల నెక్లెసు చేయించుకోవచ్చు; అబ్బాయి పేరు చివర ఎం. బి. బి. యస్ చేర్పించవచ్చు. అమ్మాయికో మొగుణ్ణి కొనిపెట్టచ్చు. ఓ చిన్న అందమైన బంగళా కట్టించొచ్చు అంటావు. అంతేనా?"

"అవేం కాదండీ!మనింటి కెదురుగా ఉన్న మూడంతస్థుల మేడలో ఉన్నాయన-ఆ వ్యాపారం మొదట పదివేలతోనే మొదలుపెట్టి, ఇప్పుడింత వాడయ్యాడుట. మీరు కూడా అలాగ...."

"అంతటితో ఆపు. నీ మాట లెవరైనా వింటే కొంప మునుగుతుంది. ఇప్పుడా ఎదురింటి పెద్దమనిషి రాజబంధువుగా జైల్లో వున్నాడు."

"ఏమో!అదంతా నాకనవసరం. నేను మాత్రం కథ వ్రాసి తీరుతాను. ఆపైన మీరు వ్యాపారమే చేస్తారో, అమ్మాయి పెళ్ళే జరిపిస్తారో మీ ఇష్టం."

"దొంగ సంతకం పెట్టి, లంచం తినిపించి, పంచదారకార్డు సంపాయించగానే సరా? క్యూలో నిలబడి పంచదార తేగలగాలి కదా? ముందు కథ రాయి. తరువాత సినిమావాళ్ళు తీసుకోడం, పదివే లివ్వడం గురించి ఆలోచిద్దాం!"

"ఓస్! అదెంతపని! మీనాక్షి రా య గా లేంది, ఆ మాత్రం రాయడం రాదా ఎవరికైనా?"

"బాగుంది. నాకు గడ్డాలు మీసాలు వస్తున్నాయి. మరి నీకు రావేం? అందుకని ఎవరి గురించో కాక నీ గురించి నువ్వు ఆలోచించడం నేర్చుకో!"

"ఇది మరీ బాగుంది. నే నన్న దానికి, మీరు చెప్పినదానికి సాపత్యమేవిటీ? ఐదో క్లాసు అదీ నేనూ కలిసి ఒకే బళ్ళో చదువుకున్నాం, మాస్టారికి దసరా కట్నం దండిగా చదివించింది కనక అది పాసయింది కాని...."

"కాని?!....నువ్వు మాత్రం అటు చదవక, ఇటు చదివించక

ఫేలయావు అంతేనా?"

"చాల్లెండి మీ వెటకారాలూ, మీరూను. అయినా కథలు రాయడానికి డిగ్రీలు కాదు కావల్సింది లోకజ్ఞానం."

"అహాఁ! అలాగా! నాకు తెలియదుగాని ఇవాళయినా కనీసం సర్కార్ ఎక్స్‌ప్రెస్ లేటుతో ఐనా ఆఫీసుకి చేరనిస్తావా? లేదా? అక్కడ రోజూ మా హెడ్ గుమాస్తా తిట్టిపోస్తుంటాడు. నువ్వు పని చేసేది తాలూకాఫీసులో. మరీ సింగిల్ టీచర్ స్కూల్లో కాదు గుర్తుంచుకో అంటూ!"

"ఇదుగో వంటయిపోవచ్చింది. వడ్డించేస్తున్నా కాని మీరు మాత్రం ఆఫీసునుంచి తిరిగి వచ్చేప్పుడు ఓ రెండు దస్తాల తెల్ల కాగితాలు, ఇంకుబాటిల్ ఇంకా...."

"పెద్దబాలశిక్ష వద్దూ?"

"అదేవయినా పిల్లల కథల పత్రికా? అయితే పట్రండి. అందులో కథలెలా ఉన్నాయో చూద్దాం."

"నీ మొహం! సరే....ఇంకేం కావాలి?"

"ఓ పెన్ను....ఊ....పో నీ పెన్ను వద్దులెండి. మీ పెన్నుందిగా."

"మీ నాన్న, పెళ్ళిలో నాకు చదివించినవాటిలో అదొక్కటే మిగిలివుంది. అప్పగించిన నువ్వు ఓ అసలుగా, పుట్టి పెరిగిన మన కోతిమూక వడ్డీగా మాత్రం మిగిలిపోయారు. కనీసం పోయిన మీ నాన్న గుర్తుగా ఆ పెన్నయినా ఉండనీ."

"మేం అసలు,వడ్డీలుగా కన్పించకూడదనేగా నా తాపత్రయమంతా?" నిష్ఠూరం ధ్వనింపచేస్తూ అంది సుబ్బలక్ష్మి.

"పోనీ, ఏదో అఘోరిద్దువుగాని, ముందు వడ్డించు. ఇప్పటికే చాలా ఆలస్యమయింది. అన్నట్లు మన వెధవాయిల కింత బుద్ధి ఎప్పణ్నించి? ఇంట్లో లేరా ఏవిటి? మాటల సందడిలో మర్చేపోయాం వాళ్ళ గురించి."

ఇల్లంతా ఇద్దరూ ఓసారి కంగారుగా కలియ దిరిగి వంటింట్లో అడుగు పెట్టారు.

"నాన్నా! పాలల్లో పంచదార వేసుకొని తాగితే తియ్యగా ఉన్నాయి నాన్నా!" అన్నాడు పాలగిన్నె నోట్లోంచి తీస్తూ. నానిగాడు.

"పాలూ పంచదార తీపిగాక చేదుట్రా నా చిట్టితండ్రీ? లేకపోతే జనం వాటికోసం ఎందుకు గోల పెడతారు?" వాణ్నొంచేస్తే బాగుం

టుందో తోచక కోపం దిగమింగు కున్నాడు.

"అమ్మోయ్! నేను తానం సేసే త్తున్నా బుద్దిగా! మరన్నంపెత్తవూ" మంచినీళ్ల బకెట్ లోంచి తొంగి చూపింది పాప.మడిగా తెచ్చి పెట్టు కున్న మంచినీళ్ల బకేట్ దానికి బాత్ టబ్ లా అన్పించింది గామోసు!

అన్నం మాట గుర్తొచ్చేసరికి ఇద్దరూ పొయ్యి వైపు చూపులు త్రిప్పారు. గంజి నీళ్లు పొంగి పొయ్యిలో పడ్డంవలన నిప్పు కాస్తా ఆరిపోయింది. అన్నం సగం ఉడికి ఊరుకొంది. 'అయ్యో! నా మతి మండా!' అంటూ పొయ్యివేపు గెంతింది సుబ్బలక్ష్మి.

ఈ లోపుగా అలమారు నుంచి పప్పు డబ్బా తిరగబడింది. పప్పంతా పాప ఒలక బోసిన నీళ్లలో చిందరవందరగా పడి చెదిరి పోయింది. డబ్బా పడ్డ శబ్దా నికి ఒక్కమారుగా ఉలికిపడి అల మారు వైపు చూసా రిద్దరూ!అందు లోంచి బుజ్జిగాడు క్రిందకు దిగడా నికి నానాయాతనా పడుతున్నాడు. పాలగిన్నె కోసం వాణ్ణి అందు లోనికెక్కించినట్టుంది. పాలగిన్నె దొరగ్గానే వాడి ఖర్మానికి వాణ్ణి అందులో వదిలేశారు. కాని వాడేం తక్కువ తిన్నాడా? పెరుగు గిన్నెలో వున్న పెరుగు, వెన్న వగైరా తిన్నంత తిని ఒంటికి రాసు కోవల్సినంత రాసుకున్నాడు. అమ్మా నాన్నా తనను చూడగానే ఒక్కసారిగా సంతోషపడి పోయి చేతులు జాపి ముందుకు దుమక బోయాడు. ఒక్క క్షణం ఉంటే పడి పోవాల్సిందే. కాని రంగనాథం ఒక్క గంతులో వెళ్ళి వాణ్ణి అందు కున్నాడు లేకపోతే ఆఫీసు మాట దేవుడెరుగు, ఆస్పత్రి చుట్టూ తిరిగి చావాలి. కోపాన్ని మరొక్కసారి నిగ్రహించుకుంటూ వాడి వైపు చూశాడు. కాని ఈ లోపున వాడు చేయాల్సిన పని కాస్తా చేయనే చేసాడు.

"నాన్నా ఇందు!" అంటూ వాడి చేతిని రంగనాథం మూతికి రాసి "బాందా?" అని అడిగాడు.

"నీ బొంద! వెధవా!" అని ఒక్కవిసురుతో వాణ్ణి క్రిందకు దింపాడు. ఆఫీసుకని వేసుకున్న డ్రస్ కాస్తా పాడయిపోవడమే కాకుండా ఎంగిలి వెధవ....వాడి ఎంగిలి కూడా తనకంటించాడు. కోపమొచ్చి కళ్ళెర్రజేస్తూ వాడివైపు చూసాడు. వాడప్పటికే తల్లి చీర కుచ్చెళ్ళలో దాక్కున్నాడు. రంగ నాథం అవతారం చూస్తే సుబ్బ లక్ష్మితో సహా పిల్లలందరికి నవ్వా

చ్చింది. చేసేదేమీ కానక, ఏడ్వ లేక తను కూడా వాళ్ళ నవ్వుల్లో శృతి కలిపాడు, ఇక ఆ పూటకు ఎలాగూ ప స్తే! ఆఫీసు గుర్తుకువచ్చి తిండి గురించి కూడా ఆలోచించ కుండా పరుగు దీశాడు పాపం కాబోయే రచయిత్రి మొగుడు.

*　　*

"ఏవండీ!"

"మళ్ళీ ఏమొచ్చింది?"

"అదికాదండీ; నేను ఇవాళ కథ రాయడం మొదలెడదామను కుంటున్నాను. కాస్త మీరు ఆఫీ సుకి సెలవుపెట్టి నాతో సహకరించ గూడదూ?"

"బాగుంది! రేపు నీకు వేవిళ్ళు వస్తే, నొప్పులు నన్ను పడమనేట్టు న్నావ్, నా వల్లగాదు సుమా! అయినా సెలవుపెట్టి నేనేం చేయాలి గనుక?"

"ఈ పూటకి కాస్త వంటా వార్పూ అదీ చూసుకొని, బుజ్జి గాణ్ణి ఎత్తుకొని ఆడిస్తే చాలు."

"అమ్మబాబోయ్! వంటావార్పు మాటెలా ఉన్నా బుజ్జిగాడి ముక్కుకి ఏ సిమెంటు వేసి ఆన కట్ట కట్టినా కొట్టుకుపోతుంది. ఆ చీవిడి వెధవని ఎత్తుకొని ఆడిం చడం నావల్లగాదు."

"అలా అంటే ఎలాగండీ? రేపు నా కథకి వ్రాసే పరిచయ వాక్యాలలో 'అసలు మా శ్రీవారి సహాయ సహకారాలు, ప్రోత్సా హమూ లేందే నేను రచయిత్రి నయేదాన్ని కాదు. అందుకు కృత జ్ఞతగా శ్రీవారి పాదారవిందము లకు భక్తితో సమర్పించు నా తొలి ప్రసూనమిది' - అని వ్రాయొద్దూ?"

"సహాయ సహకారాలంటే వంట వండడమూ, బుజ్జిగాణ్ణి ఎత్తుకోడమూనా?"

"ఏమో! నాకదేం తెలియదు! ఇవాళ మీరు సెలవు పెట్టాల్సిందే! నా రచనావేశానికి, భావోద్వేగానికి అడ్డు తగలవద్దు" అంటూ మారు మాటాడకుండా కాగితాలుముందేసు క్కూర్చుంది. ఆఖరుకి, ఆవేళ సెలవు పెట్టక తప్పింది కాదు రంగ నాథానికి.

*　　*

"ఇదిగో! మిమ్మల్నే!! ఈ కథ చదివి మీఅభిప్రాయం ఎలా ఉందో చెప్పండి"

కథ చదివిన రంగనాథం "ఇదివరకెక్కడో చదివినట్టుగా ఉందే!" అన్నాడు.

"ఆ! సింగినాదం! ఒక రచ యిత ఊహలు మరొక రచయిత ఊహలతో కలవకూడదని ఎక్క డుంది. అందుకనే క్రిందవ్రాసాగా!

అది కూడా చదవండి."

"ఈ కథలో పాత్రలు, సంఘటనలు అన్నీ కాపీలే- ఇదేవిటీ.... కల్పితాలా? కాపీలా?"

"అయ్యో! మర్చిపోయాను, అలా వ్రాశానా?" జరిగిన పొరపాటుకు చింతిస్తున్నాం-అని చేరిస్తే సరిపోతుందిగా?"

"నీ మొహం" అని పొరబాటును సరిదిద్ది తిరిగి చదవడం మొదలు పెట్టాడు.

"ఈ కథపై గల సర్వహక్కులు రచయిత్రివే. దీనిని ప్రచురించిన పత్రికాధిపతులకు, పాఠకులకు నా కృతజ్ఞతలు.

ఇట్లు మీ అభిమాన రచయిత్రి
శుభానాథ్".

"ఇవన్నీ ఇప్పుడే ఎందుకే? పత్రికల వాళ్లు దీన్ని ప్రచురణార్హంగా భావించాలి గదా!"

"ఆ! వేసుకోకేం చేస్తారు? ఇంతకంటే ఎన్ని చెత్త, చచ్చు కథలు పత్రికల్లో మీరు చదవడం లేదు? ఇది తప్పక పత్రికల్లో పడి తీరుతుందని నా గట్టి నమ్మకం. అలాంటప్పుడు ఈ కథ చదివిన ఏ సినిమా నిర్మాతకైనా ఈ కథపై గల హక్కులెవరివో సులభంగా తెలిసిపోతుంది. ముందు జాగ్రత్త ఎందుకైనా మంచిది కదా?"

"పోనీ, ఈ విషయంలో మీనాక్షమ్మగారి సలహా పొందకూడదూ?"

తను చెపితే వినని మొండిఘటమని రంగనాథానికి తెలుసు.

"ఇందులో ఎవరి సలహాలు, సంప్రదింపులూ అవసరంలేదు. ఎడ్రసు వ్రాసి పత్రికకి పంపించండి" విసవిసా వెళ్ళిపోయింది శుభానాథ్‌గా మారిన రచయిత్రి సుబ్బలక్ష్మి.

*

"ఏవండోయ్! పోస్టుమాన్ వెళ్ళిపోతున్నాడు. మన కేవయినా ఉత్తరా లున్నాయేమో అడక్కూడదూ?"

"ఎందుకే అడగడం? ఉంటే తెచ్చివ్వడు గనుకనా?"

"అది కాదండీ! పొరపాటున మర్చిపోయేడేమోనని...."

"ఇన్నాళ్ళూ లేని మతిమరుపు కొత్తగా వస్తుందటే అతనికి? నువ్వు పండుగ మామూళ్ళు ఏమయినా మర్చిపోతే ఏమోగాని?"

"ఒరే! బుజ్జిగా! నువ్వెనా పిలవరా ఉత్తరాలబ్బిని" ఉండబట్టలేక చంకనున్న బుజ్జిగాణ్ణి దింపింది.

వాడు తుర్రున పరుగెట్టి "ఏయ్ ఉత్తాలబ్బీ! ఆగు! మా నానాలికి

ఉత్తాలివ్వేం ?" అన్నాడు.

"ఏం లేవు బాబూ" అంటూ అతను వాణ్ణి ఎత్తుకొని వచ్చి గుమ్మంముందు దింపి "బాబూ! శుభానాధ్ అనే రచయిత్రిట. ఎవరున్నారండీ ఈ వీధిలో ?" అని అడిగాడు.

ఇదే ఇల్లని రంగనాధం, అవును నేనేనని సుబ్బలక్ష్మి ఒక్కసారిగా సమాధాన మిచ్చారు. పోస్టుమాన్ సుబ్బలక్ష్మి చేతుల్లో ఓ కవరుంచి వెళ్ళిపోయాడు - కాదు సుబ్బలక్ష్మే అతని చేతుల్లోంచి ఆ కవరు లాక్కొంది.

"ఏవండోయ్! నే చెప్పలే! అనుకున్నట్టుగానే కథ పత్రికలో అచ్చయింది. నేనూ రచయిత్రి నయిపోయాను చూసారా? మీ కన్నీ అక్కర్లేని అనుమానాలే!" అంటూ పట్టలేని ఆనందంతో చిన్నపిల్లలా గంతులు వేసింది. ఏమనడానికీ నోరురాని రంగనాథం పత్రిక చూస్తూండిపోయాడు.

"హమ్మయ్య! ఇక ఈ కథ ఏ సినిమా వాళ్లో చదవడం, చదివినవాళ్ళు మనింటిని వెతుక్కుంటూ రావడం మాత్రమే మిగిలింది. మీరెవరికైనా తొందరపడి మాటిచ్చేరు సుమా! ముందుగా వాళ్లెంత అంటే అంతకు ఒప్పేసుకోవద్దు. కాస్త బెట్టు చేయాలి. తెలిసిందా? మీకు తెలిసిన వాళ్ల దగ్గర కూడా ఈ విషయం కదిపి చూడండి. విన్నారు కదూ! ఏం మాట్లాడరేం? మీ కేం తెలియదనే మరింతగా చెప్పడం. తెలిసిందా?" అంటూ అనర్ఘళంగా మాట్లాడేస్తోంది, కంట్రోలు తప్పిన బండి డౌన్లో పోయినంత స్పీడుగా.

"అలాగేలేవే! అలాగేచేదాం?"


"అయితే మరి నే చెప్పినట్టు వ్యాపారం చేస్తారా?"

"అమ్మబాబోయ్! అది మాత్రం నా వల్ల కాదు. నీ డబ్బుకీ నీకూ ఓ దణ్ణం. నాకీ గుమాస్తాగిరీ చాలు. నన్నిలా పరువుగా బ్రతకనీయ్!"

"ఎప్పుడైనా నా మాటలకు అడ్డు చెప్పకుండా విన్నారు గనుక నా? సరే మీ ఇష్టం" అంటూ విసవిసా లోనికి పోయింది సుబ్బలక్ష్మి.

* * *

ఓ రోజు భోజనం చేసిన తరువాత పడక వాల్చి కునుకు తీస్తున్నాడు రంగనాథం. ఎండ తీక్షణంగా కాస్తోంది బయట. గాలి లేక ఉక్కబోస్తోంది కూడా. నీడలు సూర్యుడికి భయపడి కామోసు కనిపించడం మానేసాయి. కాకి కావు మన్న శబ్దం కూడా విన్పించడం లేదు. ఇంతలో పోస్ట్ అన్న కేక



విన్పించింది. పడుతున్న నిద్ర ఒక్కసారిగా విడిపోయింది. దిగ్గున లేచి వెళ్లాడు.

"మీకు కాదండి. శుభానాథ్ గార్కి! రిజిష్టర్డ్ లెటర్!" అన్నాడు పోస్ట్‌మన్. శుభానాథ్ పేరు వినగానే నాగస్వరానికి పుట్టనించి లేచే నాగుబాములా దూసుక వచ్చింది సుబ్బలక్ష్మి. చేతిలో పని చేతిలో ఉండగానే!

"చూశారా! నేచెప్పలే? ఇదేదో ఉత్తరాల ద్వారా సినిమావాళ్లు మన కథని బేరమాడుతూ ఉండవచ్చు. చదవండి" అంది ఇంగ్లీషులోఉన్న ఉత్తరాన్ని రంగనాథానికి అందిస్తూ.

ఉత్తరం చదువుతున్నకొద్దీ అతని ముఖకవళికలు మారసాగాయి. అది గమనించి సుబ్బలక్ష్మి కంగారు పడుతూ—

"ఏమండీ! ఏమయిందిఅందులో. ఎందుకలా కంగారు పడతారు!" అంది.

"ఏవయిందా? కథలు కథలంటూ కొంప ముంచావుగదే! ఇదిగో చూడు. నువ్వు వ్రాసినకథ నీ సొంతంకాదని. ఆకథ నిదివరకే తన పేరున ప్రచురించడం జరిగిందని. దానిని నువ్వు కాపీ చేశావని.

ఆ కథపై హక్కులు తనకేగాని ఇతరులకు చెందనేరవని, అందుకు భిన్నంగా ప్రవర్తించిననీపై ఎందుకు చర్య తీసికోరాదని సవాలు చేస్తోంది నీ పొరుగింటి రచయిత్రి మీనాక్షమ్మోదిన." అన్నాడు పళ్ళ బిగువున.

"ఒరి దేవుడోయ్! నేనే పాపం ఎరుగనండోయ్! నన్ను రచ్చకీడుస్తానంటుందా? నేనేం ద్రోహం చేశానని? పోనీ మన మీనాక్షమ్మొదిన గదా అనుకున్నా. అప్పటికీ పేర్లు మార్చి వ్రాసాను గదండీ! అయినా ఆవిడ కదేం పోయే కాలం? మన దగ్గర ఆవిడ, ఆవిడ దగ్గర మనం కావలసిన సామాన్లు తీసి తెచ్చుకోవడం లేదూ? అలాగే ఇదీనూ! దీనికింత రాద్ధాంతం చేస్తుందా? హవ్వ! తెల్లవారితే మొహమొహాలు చూసుకోవాల్సిన వాళ్ళమనే సంగతికూడా మర్చిపోయినట్లుంది. పోనీలెండి, ఆవిడకు లేనప్పుడు మనకెందుకు? ఏం, మనమేనా అంత లేనివాళ్ళమూ! లేచిపోయినవాళ్ళమూ? రేపు మనకు రాబోయే పదివేల రూపాయల్లో కొంతసొమ్ము ఆవిడ మొహాన్న కూడా పారేస్తే సరి! మీరేం కంగారు పడకండి." అంది సుబ్బలక్ష్మి భర్తని ఓదారుస్తూ.

"నీ పదివేలు మాట దేవుడెరుగు. ముందీ పితలాటకం వదిలించుకోడం ఎలారా భగవంతుడా! ఒసే సుబ్బులూ! ఇకమీద కథలూ, పదివేలూ అన్నావో జాగ్రత్త. ఇప్పటికయింది చాలుగాని ఇక లోపలికి దయచెయ్!" అంటూ కాలుగాలిన పిల్లిలా ఆ ఎండలో వీధిలోకి దౌడుతీసాడు - పాపం రచయిత్రి మొగుడు రంగనాధం! *

---

## రచయితలకు మనవి

'విజయ'కు కథగాని, గేయంగాని, కార్టూన్స్‌గాని, జోక్స్‌గాని ఏవి పంపినా అవి ప్రచురింపబడేందుకు మాకు ఆరు నెలలు వ్యవధి యివ్వవలసిందిగా కోరుతున్నాం.

ఆరు నెలల లోపల ప్రచురింపబడనిచో రచయితలు తమ రచనలను వేరే పత్రికకు పంపుకోవచ్చు.

ప్రతి రచనతోపాటు రచయిత అది తమ స్వంత రచన అని హామీపత్రం వ్రాయవలసి వుంటుంది. ఆ విధంగా వ్రాయబడని రచనలు ఎంతమాత్రం స్వీకరించబడవు.

—ఎడిటర్